కమ్యూనిటీహాల్‌ను పరిరక్షణ కమిటీకి అప్పగించాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సభ్యుల వినతి

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ నిర్వహణను ఎస్ఆర్‌టీ జవహర్‌నగర్ వ్యాయామశాల, ఆటస్థలం, కల్యాణ మండపం పరిరక్షణ కమిటీకి అప్పగించాలని కమిటీ సభ్యులు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ గిరినగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కిషన్‌రెడ్డిని కమిటీ అధ్యక్షులు నర్మెట్ట మల్లేశ్, ప్రధానకార్యదర్శి గుండు నాగేశ్వరరావు, సలహాదారులు ఎస్. కృష్ణ యూత్ అధ్యక్షులు గుండు మహేందర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆధీనంలో ఉన్న కమ్యూనిటీహాల్ నిర్వహణ సక్రమంగా లేదని కేంద్రమంత్రికి వివరించారు. కమ్యూనిటీహాల్‌లో ఫ్యాన్లు, లైట్లు, విండోలు, అద్దాలు, తలుపులు, మెయిన్ గేట్‌కు తాళం లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కమ్యూనిటీహాల్‌ను నిర్వహించే అవకాశాన్ని కల్పిస్తే జిమ్‌ను ఏవిధంగా నిర్వహిస్తున్నామో అదేవిధంగా నిర్వహించి శుభకార్యక్రమాలు చేసుకునేవారికి ఎంతో సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కేంద్రమంత్రి ఈ విషయంలో చొరవచూపాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి తనవంతు సహకారం అందిస్తానని హామీనిచ్చారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా కంటి పరీక్షలు



అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత కంటి పరీక్షా శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహిస్తున్నామని, స్థానిక తల్లిదండ్రులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. శుక్రవారం చప్పల్‌బజార్, ఇందిరానగర్‌లలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు కోఠి యూపీఎస్‌పీ, ఆర్ఎంపీటీసీల సహకారంతో కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఐదేళ్లలోపు వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ జనార్ధన్, అలేఖ్య, సబితి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బీజేపీ నాయకులు భీమ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌లింగంపల్లిలో వీధి దీపాల ఏర్పాటును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలి: రవి

రాంనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో వెలగని వీధిదీపాల స్థానంలో నూతన విద్యుత్ దీపాలను వెంటనే ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కె.రవిచారి ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లిలో వీధి దీపాల ఏర్పాటును ఆయన పరిశీలించి మాట్లాడారు. డివిజన్‌లోని పలుచోట్ల అంతర్గత రోడ్లలో వీధి దీపాలు వెలగక పోవడం వల్ల రాత్రివేళల్లో పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ స్పందించి వర్షా కాలంలో పలు ప్రాంతాలలో వెంటనే నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉపేందర్, శ్రీనివాస్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు: ఎంపీ అనిల్



ఉపేందర్‌రెడ్డిని కలిసిన ఎంపీ అనిల్‌కుమార్

చిక్కడపల్లి మే23 (ఆంధ్రజ్యోతి): సమాజ వికాసానికి గ్రంథాలయాలు ఎంతో తోడ్పడుతాయని ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ ఛైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డిని ఎంపీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎంపీ అనిల్ లైబ్రరీ ఛైర్మన్‌కి తెలిపారు.

గొప్ప సంఘసంస్కర్త రామ్మోహన్‌రాయ్ : కొలకలూరి

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): నాడు హిందూమతంలో ఉన్న ఎన్నో మూఢాచారాలను వ్యతిరేకిస్తూ ఉద్యమించిన రాజా రామమోహన్‌రాయ్ గొప్ప సామాజిక సంఘసంస్కర్త అని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా రాజారామమోహన్‌రాయ్ యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ వివిధ దేశాల్లో నాటి సామాజిక మతపరంగా ఉన్న పలు రుగ్మతలను పలువు రు సంఘసంస్కర్తలు ఆవిర్భవించారని భారతదేశంలో తొలిగా రాజారామమోహన్‌రాయ్ నాటి మతగ్రంథాలు పేరిట జరుగుతున్న అమానవీయ పరిస్థితులను ఎదిరించి నిలిచిన విప్లవకారుడన్నారు. రచయిత్రి శైలజామిత్ర మాట్లాడుతూ, దేశంలో ఆంగ్లభాష అవసరం గుర్తించి బ్రిటిష్ వారికి ఆంగ్ల భాష విద్యావిధానం కోసం సహకరించిన మేధావి రామమోహన్‌రాయ్ అని చెప్పారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన సభలో నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సామాజిక కార్యకర్త పీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నీరా కేఫ్ బాధ్యతలను గీతా కార్పొరేషన్‌కు అప్పగించాలి

గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారాయణగౌడ్



మాట్లాడుతున్న అంబాల నారాయణగౌడ్

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి) : నీరా కేఫ్ నిర్వహణ బాధ్యతలను గీతా కార్పొరేషన్‌కు అప్పగించాలని గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబా ల నారాయణగౌడ్ డిమాండ్ చేశారు. నిరుపేద గీత వృత్తిదారులకు ఉపాధి కల్పించాలని కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీతా కార్పొరేషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని గీతన్నల సంక్షేమానికి కేటాయించాలన్నారు. పాడి పరిశ్రమ మాదిరిగా నీరా పరిశ్రమను అభివృద్ధి చేయడానికి సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. దీనిపై గౌడ కల్లు గీతా సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నీరా కేఫ్ టెండర్లను నిలిపివేయాలన్నారు.

రేపట్నుంచి కోటి సభ్యత్వాల సేకరణ

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేష్

రాంనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో బీసీ ఐక్యత, సంఘటిత శక్తిని పెంపొందించేందుకు బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో కోటి సభ్యత్వ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ నెల 25వ తేదీన సమితి కార్యాలయం లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతతో 10 లక్షల సభ్యత్వం జూన్ నెలలో పూర్తి చేస్తామన్నారు. తర్వాత గ్రామ, మండల, బస్తీ, పట్టణ, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో సభ్యత్వం పూర్తిచేస్తామన్నారు. బీసీలందరూ ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

నగర అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి



పనులు ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుందని చెబుతున్న ప్రభుత్వం నగరంలోని బస్తీలు, కాలనీల అభివృద్ధికి అరకొరగా నిధులు కేటాయించడం సబబు కాదని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రప్రభుత్వానికి అత్యధికశాతం రెవెన్యూ నగరంనుంచే వస్తున్నందున ప్రధానంగా జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డ్‌లకు చాలినన్ని నిధులు కేటాయిం చి నగరాభివృద్ధికి కృషి చేయాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్‌లో శుక్రవారం రూ.1.29 కోట్ల ప్రజాభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. గోల్కొండ చౌరస్తానుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌వరకు, అరుంధతినగర్ బస్తీ, నీమ్‌కర్ లేన్, టీఆర్‌టీ బస్తీ దవాఖాన వెనుక వీధితోపాటు వీవీగిరినగర్ బస్తీలో నూతన మంచినీటి, సీవరేజీ పైప్‌లైన్‌ల ఏర్పాటుకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాం లో కార్పొరేటర్‌లను అసలు పట్టించుకోలేదని ఎమ్మెల్యేలతోనే అభివృద్ధి పనులు, నిధులు మంజూరు చేశారని కాంగ్రెస్‌కు నగరంలో ఎమ్మెల్యేలు లేరు, కార్పొరేటర్లు కూడా లేరు అందుకే నగరాన్ని పట్టించుకోవడంలేదని ఎద్దేవా చేశారు. నగరం నుంచే అత్యధికంగా ప్రభుత్వానికి బడ్జెట్ నిధులు వస్తున్నందున నగరాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ రామానుజులురెడ్డి, డీఈ సన్ని, గీత, ఏఈ అబ్దుల్‌సలామ్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సికింద్రాబాద్ ఆర్‌డీవో సాయిరామ్, సర్కిల్ 6 ఎఎస్‌వో దీప్తిచౌదరి, ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, వాటర్‌వర్క్స్ జీఎం రామకృష్ణ, డిజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకే పనికి రెండు ప్రారంభోత్సవాలు

గిరినగర్ హనుమాన్ ఆలయం వద్ద ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఒక్కరే కొబ్బరికాయకొట్టి పనులు ప్రారంభించారు. అనంతరం కిషన్‌రెడ్డి వచ్చిన తర్వాత బస్తీలోని అమ్మవారి ఆలయం వద్ద కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్‌లతో కలిసి ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. కాగా అరుంధతినగర్‌లో గతంలోనే సీవరేజ్ పైప్‌లైన్ పనులు ప్రారంభించారని అయితే ఆ పనులు మొదలే కాలేదని ఇప్పుడు మళ్లీ అదే పనికి ప్రారంభోత్సవం చేయడం ఏమిటని బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు



లాల్‌బహదూర్ శాస్త్రినగర్‌లో స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ, మే 23 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రినగర్‌లో నెలకొన్న మంచినీటి, విద్యుత్, రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. కవాడిగూడ ఎల్‌బినగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం ముఠాగోపాల్ బస్తీని సందర్శించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. బస్తీ మహిళలు మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూం పథకం కింద మొత్తం 40 ఇళ్లను నిర్మించారని అందులో 37 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారన్నారు. మిగతా మూడు ఇళ్లను అర్హులకు కేటాయించకుండా పెండింగ్‌లో పెట్టారని, ఇళ్ల కేటాయింపు సమయంలో లిస్టులో తమ పేర్లు ఉన్నప్పటికీ తమకు ఇళ్లు రాలేదని ఆ ఇళ్లు తమకువచ్చేలా చూడాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఎల్‌బినగర్‌లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. బస్తీలో మంచినీటి, డ్రైనేజ్ పైప్‌లైన్ వేశారని, రోడ్డు వేయలేదని, తమ ఇళ్లకు ఒకవైపున ప్రహరీ నిర్మించలేదని, హైమాస్ లైట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ముఠాగోపాల్ మాట్లాడుతూ, ఎల్‌బినగర్‌లో పెండింగ్‌లో ఉన్న మూడు ఇళ్ల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. బస్తీలో సీసీ రోడ్డు, విద్యుత్ స్ట్రీట్ లైట్ సమస్య, ప్రహరీ నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ముఠాజైసింహ,వాసు, బస్తీ వాసులు, వల్లాల శ్యామ్‌యాదవ్, బస్తీ మహిళలు పాల్గొన్నారు.

కలుషిత నీటి నివారణకు చర్యలు : ఎమ్మెల్యే

ముషీరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ మోహన్‌నగర్‌లో కలుషిత నీటి నివారణకు యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానికులకు హామీ ఇచ్చారు. శుక్రవారం మోహన్‌నగర్‌కు చెందిన బస్తీ పెద్దలు గండి కృష్ణ, పూసగోరక్‌నాథ్, రాజు, సైదాబాను తదితరులు ఎమ్మెల్యేను కలిసి కలుషిత నీటి సరఫరాను నివారించాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ పైప్‌లైన్‌లు తొలగించి కొత్త పైప్‌లైన్‌లు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్య పరిష్కరించాలని జలమండలి అధికారులకు ఆదేశిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్‌నగర్ వాసులు జయలక్ష్మి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి, వేదికపై మాజీ ఎంపీ వీహెచ్, పార్టీ పరిశీలకులు వినోద్‌కుమార్, సౌజన్య

రాంనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పని చేసే ప్రతి ఒక్కరికి పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న హామీలను ప్రజలకు తెలియజేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను గల్లీ స్థాయిలో తిప్పికొట్టాలని సూచించారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేటలోని హోటల్ ధ్రువలోని హాల్‌లో అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రతీ కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్ఠం చేయాలని, ఇలా చేసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు వస్తుందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే బూత్ స్థాయి నుంచి పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఎదిగారన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ పరిశీలకులకు నాయకులు తమ బయోడేటాను అందజేస్తే వారి సేవలను గుర్తించి పదవులు దక్కుతాయన్నారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తద్వారా నాయకులకు గుర్తింపు వస్తుందన్నారు. పార్టీ పరిశీలకులు వినోద్‌కుమార్, సౌజన్య మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ పుల్లా నారాయణ స్వామి, ఖైరతాబాద్ జిల్లా మహి ళా విభాగం అధ్యక్షురాలు ఉషశ్రీ, టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ గ్రేటర్ అధ్యక్షుడు రోహిత్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులిజగన్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ అభిమానులకు వేదికగా యాప్

రాయదుర్గం, మే 23(ఆంధ్రజ్యోతి): భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్లను, అభిమానులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు ఫ్యాన్‌లీ యాప్‌ను రూపొందించారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ యాప్‌ను బ్యాడ్మింటన్ కోచ్, అర్జున అవార్డు గ్రహీత గోపీచంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్ ఇండియా పేరుతో దేశంలోని అగ్రశ్రేణి ఆటగాళ్లు, యువ ప్రతిభావంతులు, అభిమానులు ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఫ్యాన్‌లీ కమ్యూనికేషన్స్ ఇండియా ఫౌండర్ మాట్లాడుతూ.. దేశంలో బ్యాడ్మింటన్ క్రీడకు ఎంతో ఆదరణ లభిస్తున్నా, మొత్తం కమ్యూనిటీని కలిపే ఒక వేదిక ఇంత వరకు ఏర్పాటు కాలేదన్నారు. ఇప్పుడు ఫ్యాన్‌లీ ఆ లోటును తీర్చుతుందన్నారు. జాతీయ స్థాయి నుంచి పాఠశాల స్థాయి వరకు ఆటగాళ్లను అభిమానించే వారందరికీ ఫ్యాన్‌లీ ఒక ఇల్లుగా మారుతుందన్నారు. ఈ యాప్‌ను యాపిల్, గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

విద్యుత్ బిల్లు పేరుతో మోసం

● **పోలీసులకు ఆర్మీ అధికారి ఫిర్యాదు**

బంజారాహిల్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు బకాయి చెల్లించాలంటూ సైబర్ నేరగాళ్లు విశ్రాంత ఆర్మీ అధికారిని మోసం చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10 ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివసించే ఘన్‌శ్యాంపాండే విశ్రాంత ఆర్మీ అధికారి. మూడు రోజుల క్రితం ఆయనకు ఓ వ్యక్తి ఫోన్ చేసి విద్యుత్ బిల్లు బకాయి ఉందని చెప్పాడు. వెంటనే చెల్లించాలని లింక్ పంపించగా, దాని ద్వారా రూ.46 వేలు చెల్లించాడు. కొద్దిసేపటి తర్వాత ఆ లింక్ సైబర్ నేరగాళ్లు పంపించిందని తెలిసింది. ఆయన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మహానాడు సాంస్కృతిక కార్యక్రమాల కో-కన్వీనర్ పి.సాయిబాబా

టీడీపీ హయాంలో అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తాం

రాంనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను టీడీపీ మహానాడు మేరకు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామ ని టీడీపీ మహానాడు సాంస్కృతిక కార్యక్రమాల కో-కన్వీనర్ పి.సాయిబాబా తెలిపారు. శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో మహానాడు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంప్రదాయ కళలయిన పల్లెసుద్దులు, చిందు, యాక్షగానం, జానపద కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ నెల 28న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కడపలో జరిగే మహానాడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మహానాడు కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నల్లకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంట ప్రభుత్వ హైస్కూల్‌లో 1976 లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం నల్లకుంటలో సమావేశమై గత స్మృతులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు పలుకరించుకుంటూ గత 48 ఏళ్ల నాటి ముచ్చట్లను నెమరవేసుకున్నారు. ఈ పాఠశాలలో నాలుగున్నర దశాబ్ధాల నాటి స్నేహ బంధాలను ఆనందోత్సాహాలతో సందడి చేసుకుంటూ స్మరించుకున్నారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉన్నత పదవులు పొందిన వారు ఈ సమావేశంలో తమ బాల్యస్మృతులను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నతస్థితికి కృషి చేసిన అప్పటి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస శర్మ, విశ్వమోహన్, జయపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, గోపాల్, వాసు, రమణ, శ్రీనివాస్ కర్ర, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.



న్యూనల్లకుంట ప్రభుత్వ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 1976 పదవ తరగతి విద్యార్థులు

ఉరేసుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కవాడిగూడ, మే 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని అపస్మారక స్థితికి చేరుకోగా గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీమామైదాన్ వాంబే కాలనీలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడ పీఎస్ పరిధిలోని బీమామైదాన్ వాంబే కాలనీలో నివసించే బుర్ర కృష్ణ (39), వనిత భార్యభర్తలు వీరికి ఇద్దరు పిల్లలు. కుటుంబ కలహాల కారణంగా గురువారం లోపలినుంచి గడియ పెట్టుకొని సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తలుపులు పగులగొట్టి చూడగా బుర్రకృష్ణ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ రాత్రి మృతిచెందాడు. మృతుడి అక్క నోమాల వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేసినట్లు సీఐ తెలిపారు.

దారిదోపిడీ కేసులో పాతనేరస్థురాలి అరెస్ట్

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): దారిదోపిడీ కేసులో పాతనేరస్థురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్దనుంచి చిక్కడపల్లి క్రైమ్ పోలీసులు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి డీఐ మోహన్ ఎస్ఐ మౌనికతో కలిసి వివరా లను వెల్లడించారు. గత జనవరి 17న ముషీరాబాద్‌కు చెందిన జీహెచ్ఎంసీ స్వీపర్ సత్యమ్మను చిక్కడపల్లి కల్లుకాంపౌండ్‌లో కల్లు తాగించి అక్కడినుంచి మాయమాటలు చెప్పి బెదిరించిన మల్లేపల్లికి చెందిన పాతనేరస్థురాలు కొంతం సోని అలియాస్ షహనాజ్ బేగమ్, అలియాస్ రోజి బలవంతంగా ఆటోలో మెహదీపట్నం తీసుకుపోయింది. ఈ క్రమంలో సత్యమ్మనుంచి రూ.20 వేలు, సెల్‌ఫోన్, ఏటీఎం కార్డు, చెవిరింగులు, కాలిమట్టెలు, ఈఎస్ఐ కార్డు, ఇంటి బీరువా తాళాలు, సిల్వర్ వస్తువులు తీసుకున్న సోని అక్కడినుంచి పరారైంది. బాధితురాలు జనవరి 18న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు చిక్కడపల్లినుంచి మెహదిపట్నం వరకు 50 సీసీ కెమెరా లను పరిశీలించి సోనిని అదుపులోకి తీసుకున్నారు. చోరీసొత్తులో కొంత మొత్తం నిందితురాలు జల్సాలకు వినియోగించుకోగా మిగతావి స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వివరించారు.

ఎల్లంకి ఎక్స్‌ప్రెస్ రైలులో రెండు దొంగతనాలు

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి) : బెంగళూరు- ఎల్లంకి రైల్వే స్టేషన్ నుంచి కాచిగూడకు వస్తున్న ఎల్లంకి ఎక్స్‌ప్రెస్ రైలులో రెండు దొంగతనాలు చోటుచేసుకున్నాయి. ఇద్దరు మహిళల మంగళసూత్రాలను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... సరూర్‌నగర్‌కు చెందిన వాణి (49) ఎల్లంకి ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తుండగా ఇటిక్యాల రైల్వే స్టేషన్ సమీపంలో సిగ్నల్ క్రాసింగ్ కోసం ఆగగా వాణి మెడ లోని 5 తులాల బంగారు గొలుసును దొంగ లాక్కొని పారిపోయాడు. ఇదే రైలులో ప్రయాణం చేస్తున్న పత్తికొండకు చెందిన షేక్ భానుబీ (32) రైలు బోగీలో కిటికీ వద్ద కూర్చోగా బయట నుంచి దొంగ ఆమె మెడలోని తులం బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. ఈ రెండు సంఘటనలపై బాధితు ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

పట్టాలు దాటుతూ రైలు ఢీకొని యువకుడి మృతి

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అబిషేక్ (29) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అబిషేక్ గోల్డ్ షాపులో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్‌ను సత్కరిస్తున్న నారాయణరెడ్డి, శరత్‌శ్యామ్ తదితరులు

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, దీనిపై విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాబోయే బక్రీద్, బోనాల వేడుకల సందర్భంగా శాంతియుతంగా జరుపుకోవాలని కోరుతూ సెంట్రల్ పీస్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఈస్ట్ జోన్ కార్యనిర్వహణ అధ్యక్షుడు శరత్‌శ్యామ్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు ఏసీపీని సత్కరించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని పీస్ కమిటీ సభ్యులకు సూచించారు. తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పీస్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ యూసుబ్ హమీద్, సయ్యద్ ఫరీదుద్దీన్ యూనస్, లక్ష్మణ్, వెంకట్, ఇర్షాద్ నవాబ్, షాహీన్‌బాయ్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపులో సహకరించాలి: గాంధీనగర్ ఏసీపీ



ఏసీపీ యాదగిరి

కవాడిగూడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలు. నేరాల అదుపులో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించి శాంతిపరిరక్షణకు దోహదపడాలని గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ ఏ.యాదగిరి అన్నారు. సిద్దిపేట టౌన్‌లో సీసీఎస్‌లో ఏసీపీగా విధులు నిర్వహించిన యాదగిరి బదిలీపై వచ్చి గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గాంధీనగర్ సబ్‌డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్, దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, పాతనేరస్తులపై నిఘాపెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మావోయిస్టుల దారుణ హత్యలపై నేడు మార్క్స్ భవన్‌లో సదస్సు : ఝాన్సీ

నల్లకుంట, మే 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 26 మంది ఆదివాసీలను పట్టుకుని అత్యంత దారుణంగా హత్య చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఉదయం 11 గంటలకు విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కమిటీ కార్యదర్శి జి.ఝాన్సీ వెల్లడించారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పహెల్గామ్ ఉగ్రదాడిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, యుద్ధం వద్దు, అమెరికా ట్రంప్ ప్రభుత్వానికి మోకరిల్లవద్దని, ఆపరేషన్ సిందూర్‌లోని అన్ని వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు బి.ప్రదీప్, సీపీఐ (ఎంఎల్) సెక్రటేరియట్ సభ్యులు కె.గోవర్ధన్, పీవోడబ్ల్యూ నాయకులు అనురాధ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు హాజరై పై అంశాలపై ప్రసంగిస్తారని ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1, ఆజామాబాద్ పరిధి లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు వినోద్‌కుమార్, నాగేశ్వరరావు తెలిపారు. తాళ్లబస్తీ, గుల్షన్‌నగర్, గగన్‌మహల్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు, బిబిడి, సెవెన్‌టెంపుల్ 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10నుంచి 11, విద్యానగర్ పరిధిలో 10నుంచి 10.30, చిక్కడపల్లి పరిధిలో 10.30 నుంచి 11, ఆర్టీసీక్రాస్‌రోడ్, ఆనంద్‌నగర్ పరిధిలో మధ్యాహ్నం 3నుంచి 4, అహోబిల్‌మఠ్ పరిధిలో 3నుంచి 3.30, కూచిపూడి పరిధిలో 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.